క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మూలె వినయ్‌రెడ్డి, అక్కుల్‌రెడ్డి, తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో మేకపాటి సోదరులు



వివాహ వేడుకల్లో జెడ్పీటీసీతో కలిసిన పాల్గొన్న మేకపాటి సోదరులు

ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లిలో ఆదివారం జరిగిన జెడ్పీటీసీ మోదీ రామాంజనేయులు సోదరుడి కుమార్తె వివాహ వేడుకల్లో మేకపాటి సోదరులు రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. అనంతరం ఎంపీపీ మూలే పద్మజా వినయరెడ్డి ఇంట్లో పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ కోరారు.

మంచి జరగాలంటే జగనన్నే సీఎం కావాలి



ప్రచారం నిర్వహిస్తున్న పెంచలయ్య

చేజర్ల : పేదలకు మంచి జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఉలవపల్లి, బోడిపాడు, నాగులవెలటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేశారని, ఏ రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా,పేదలు సంతోషంగా ఉండాలన్నా ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్ రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తాడికొండ నర్సింహులు, రత్నారెడ్డి, రమేష్, మురళీ యాదవ్, రోశయ్య, వెంకటరమణ, నర్సయ్య, కోటి, వసంత, పెంచలమ్మ, ఆదిలక్ష్మమ్మ, సూర్య పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మేకపాటి



ఇఫ్తార్‌లో పాల్గొన్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో ఆదివారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అనుమతులున్నా.. ఇసుక ట్రాక్టర్ సీజ్




ఇసుక రవాణాకు తీసుకున్న అనుమతులు

సోమశిల: అనంతసాగరం మండలం అగ్రహారంలోని ఓ వలంటీర్ కుటుంబ సభ్యురాలు గడ్డం రమాదేవి తనకు ప్రభుత్వం ఇచ్చిన కాలనీలతో గృహ నిర్మాణం చేపట్టింది. అనుమతులు తీసుకుని ఇసుకను తీసుకెళ్తుతుండగా ఆదివారం పడమటికంభంపాడు ఇసుక రీచ్ వద్ద అనంతసాగరం రెవెన్యూ అధికారులు, సెబ్ అధికారులు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సోమశిల పోలీస్‌స్టేషన్‌లో పెట్టారని తెలిపారు. ఇసుక రీచ్‌కు అనుమతులు లేనప్పుడు రీచ్ నిలిపివేస్తే అసలు వెళ్లం కదా అని, పేదలను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆయన నమ్మరు.. ఆయన్ను నమ్మరు

కావ్య అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- ఎన్నికల కార్యాచరణకు మిత్రపక్షాలు, పార్టీ కేడర్‌ను దూరం పెట్టిన వైనం
- పెత్తనమంతా గుమాస్తాల చేతిలోనే..
- చంద్రబాబు సభకు జనసమీకరణకు ముఖం చాటేసిన నేతలు
- ప్రజాగళం అట్టర్ ఫ్లాప్‌తో కావ్య శిబిరం డీలా



కావ్య ఎంట్రీతో కావలిలో టీడీపీ గ్రాఫ్ పాతాళానికి పడిపోయింది. కావ్య కృష్ణారెడ్డి అభ్యర్థిత్వంతో టీడీపీ భవితవ్యం తేలిపోయింది. చంద్రబాబు కావలిలో నిర్వహించిన ప్రజాగళం సభతో అది ప్రస్ఫుటమైంది. కావ్యను టీడీపీ కేడర్ ఆది నుంచి వ్యతిరేకిస్తున్న తరుణంలో ఆయన తన క్వారీల్లో పని చేసే సిబ్బందితో సొంత దళాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తనను వ్యతిరేకిస్తున్నారనే కారణంతో టీడీపీ వీరాభిమానులను సైతం కావ్య పక్కన పెట్టేశారు. టీడీపీకి మిత్రపక్షాలుగా ఉన్న జనసేన, బీజేపీ నేతలను సైతం దూరంగా ఉంచారు. ఎన్నికల కార్యాచరణలో వీరిని దూరంగా పెట్టి.. తన గుమాస్తాల చేతికే పెత్తనమంతా కట్టబెట్టారు. ఖర్చులకు సైతం డబ్బులివ్వకపోవడంతో టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ కావ్యను పక్కన పెట్టేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలే చంద్రబాబు సభకు జనసమీకరణకు కూటమి నేతలు ముఖం చాటేయడంతో ప్రజాగళం అట్టర్ ఫ్లాప్ అయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కావలి: టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఏక్ నిరంజన్‌గా మిగిలిపోయాడు. ఆయన నేతలను నమ్మడం లేదు. నేతలు ఆయన్ను నమ్మడం లేదు. కావ్య అభ్యర్థిత్వాన్ని టీడీపీ నేతలు ఆది నుంచి వ్యతిరేకిస్తున్నారు. టికెట్ రేస్‌లో పోటీపడి చివరకు సీటు దక్కించుకున్నాడు. అయితే ఎన్నికల కార్యాచరణలో తన గెలుపు కంటే.. తన వద్ద ఉండే డబ్బు కోసమే పని చేస్తారనే ఆలోచనతో సొంత పార్టీ నేతలనే కాదు.. మిత్రపక్షాలను సైతం దూరం పెట్టేశాడు. తన వద్ద పని చేసే ఉద్యోగులు, దగ్గరి బంధువులతో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పార్టీ నిర్ణయాన్ని కాదనలేక సర్దుకుపోదామని ప్రయత్నించినా మిత్రపక్షాలకు, పార్టీ కేడర్‌కు కావ్య వర్గం నుంచి ప్రతి రోజూ అవమానాలు ఎదురవుతుండటంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు రగిలిపోతున్నారు.

కావ్య శిబిరంలో కలవరం

టీడీపీ అధినేత చంద్రబాబు కావలిలో నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ కావడంతో కావ్య శిబిరంలో కలవరం మొదలైంది. ముందుగానే ప్రజాగళం షెడ్యూల్ ప్రకటించినప్పటికీ జన సమీకరణ చేయడంలో చతికిల పడ్డారు. జన సమీకరణ పేరుతో డబ్బులు తినేస్తారనే భావనతో కావ్య ప్రజాగళం బహిరంగ సభకు సంబంధించిన బాధ్యతలను కార్యకర్తలు, నాయకులను కాదని తన క్వారీల్లో పని చేసే గుమాస్తాలకు, తన దగ్గరి బంధువులకు అప్పగించారు. తమపై నమ్మకం లేక గుమాస్తాలకు బాధ్యతలు అప్పగించిన వ్యక్తి కోసం తాము ఎందుకు పని చేయాలంటూ సొంత పార్టీ కేడర్‌తో పాటు మిత్రపక్షాలు బీజేపీ, జనసేన సైతం ముఖం చాటేశారు. కావ్య అహంకార వైఖరితో ఇప్పటికే నియోజకవర్గంలో బీద రవిచంద్ర వర్గీయులు, మాలేపాటి వర్గీయులు పార్టీకి దూర దూరంగా ఉంటున్నారు. ఎవరూ సహకారం అందించకపోవడంతో తన దళాలను రంగంలోకి దింపి జన సమీకరణకు సిద్ధమయ్యారు. అసలే టీడీపీ సభలంటే జనం ముఖం చాటేస్తున్నారు. చంద్రబాబు హెలికాప్టర్ దిగినా.. జనం లేకపోవడంతో గంటా పది నిమిషాలు హెలిప్యాడ్‌లో ఉన్న బస్సులోనే పడిగాపులు పడ్డారు. ఎట్టకేలకు వెయ్యి.. రెండు వేల మందిని సభా స్థలికి చేర్చడంతో, రద్దీగా ఉండే ట్రంక్‌రోడ్‌లో జనం వచ్చే జనం, పోయే జనం పోగుకావడంతో సభ వద్దకు చంద్రబాబు వచ్చారు. ఆయన మాట్లాడుతుండగానే జనం పాలోమని వెళ్లిపోవడంతో అసహనంతో సభను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు. ప్రజాగళం ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ఆగ్రహంతో వెళ్లిన చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకుంటారో అనే ఆందోళన నెలకొంది.

మిత్రపక్షాలకు దక్కని ప్రాధాన్యం

టీడీపీ మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నాయకులను కూడా కావ్య కృష్ణారెడ్డి చిన్నచూపు చూస్తున్నారని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. తాజాగా ప్రజాగళం సభలో జనసేన ఊసే లేకపోవడంతో పవన్ అభిమానులకు మింగుడు పడటం లేదు. బీజేపీ నాయకులను కూడా పట్టించుకోలేదు. కావలి పట్టణ బీజేపీ అధ్యక్షుడి సహా సీనియర్ నాయకులంతా కూడా ప్రజాగళంలో జనాల మధ్య సాధారణ కార్యకర్తల్లా ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో బీజేపీ, జనసేన నాయకులు కూడా కావ్యకు మద్దతు తెలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.

దొంగల్లా చూస్తున్నారని...

40 ఏళ్ల నుంచి పార్టీ కోసమే పని చేస్తున్నాం. పైసా ఆశించకుండా అభిమానంతో పార్టీ జెండా మోస్తున్నాం. కొత్తగా వచ్చిన కావ్య కృష్ణారెడ్డి మమ్మల్ని దొంగల్లా చూస్తున్నాడు. ప్రచార ఖర్చులకు అడిగినా కూడా అనుమానిస్తూ తన గుమాస్తాలకు లెక్కలు చెప్పమంటున్నాడు. ఇలాంటి వ్యక్తిని ఇంత వరకూ చూడలేదు. ఇలాంటి అనుమానపు వ్యక్తి ఉన్న పార్టీలో కొనసాగడం మా వల్ల కాదంటూ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా పార్టీ నుంచి తప్పుకుంటున్నారు. ఇప్పటికే పలువురు నందమూరి అభిమానులు, సీనియర్ నాయకులు పార్టీకి, కావ్యకు దండం పెట్టి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. ఇదే బాటలో మరికొంత మంది సీనియర్ నాయకులు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

జైత్ర యాత్రగా పాదయాత్ర

- విజయోత్సవంగా సాగిన ఎంపీలు, ఎమ్మెల్యే బైక్ ర్యాలీ
- ఐదు కిలో మీటర్ల మేర అడుగడుగున పూల వర్షం



బైక్ ర్యాలీలో ఎంపీలు విజయసాయిరెడ్డి, మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పాదయాత్ర చేస్తున్న విజయసాయిరెడ్డి చేతిలో జగన్ మినీ కటౌట్, పక్కన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్ నాయుడు

కావలి: కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన ఎన్నిక ప్రచార ర్యాలీలా విజయోత్సవంగా సాగింది. పార్టీ నేతలు సున్నపుబట్టి కూడలికి చేరుకోగానే అప్పటికే మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. సుమారు 2,000 మంది యువకులు తమ బైక్‌లకు పార్టీ జెండాలు కట్టుకొని సిద్ధంగా ఉండగా ఎంపీలు, ఎమ్మెల్యే బైక్‌లపై ఎక్కి ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న దగదర్తి వరకు యువకులు జై జగన్, జై విజయసాయిరెడ్డి, జై బీఎంఆర్, జై ప్రతాపన్న నినాదాలతో హోరెత్తించి పూల వర్షం కురిపించారు. దగదర్తికి చేరుకో గానే, విజయసాయిరెడ్డి, మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డిలకు అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. దగదర్తిలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలతో స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వెలుపోడు సెంటర్ నుంచి పాదయాత్రగా ఎంపీలు, ఎమ్మెల్యే బయలుదేరారు. పాదయాత్ర దారి పొడవునా వారిపై పూలవర్షం కురిపిస్తూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఎన్నికల ప్రచారం ఆద్యంతం పండగ వాతావరణాన్ని తలపించింది.

టీడీపీ గుండెల్లో రైళ్లు

కావలి నియోజకవర్గ టీడీపీకి నిన్న మొన్నటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన మాలేపాటి సుబ్బానాయుడు స్వగ్రామం దగదర్తిలో ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలకు కనీవినీ ఎరుగని రీతిలో ఘన స్వాగతం లభించడంతో టీడీపీ శ్రేణులు నివ్వెరపోయాయి. దగదర్తిలో ఒక్క పంచాయతీలో కూడా టీడీపీకి మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ కార్యకర్తలే బాహాటంగా చర్చించుకోవడం కనిపించింది. టీడీపీ హయంలో బీద రవిచంద్రతో కలిసి సుబ్బానాయుడు సాగించిన అరాచకాలు, విమానాశ్రయ భూములతో పాటు ఏపీఐఐసీ భూముల్లో చేసిన అక్రమాలు శాపాలై ప్రస్తుతం వెంటాడుతున్నట్లు వాపోతున్నారు.

టీడీపీ నేత భూ కబ్జా

- పట్టించుకోని రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

అనుమసముద్రంపేట: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కోడ్‌ను అదనుగా చూసుకుని ఓ టీడీపీ నేత భూ కబ్జాకు తెగబడ్డాడు. మండలంలోని హసనాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సర్వే నంబరు 20లో రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణానికి పునాదులు సైతం సిద్ధం చేసుకున్నారు. టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యుడు కొన్ని రోజుల నుంచి ఆ భూమిపై కన్నేశాడు. గ్రామంలో కొంత మంది టీడీపీ నేతలు అతనికి మద్దతుగా నిలవడంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నివేశన స్థలంగా ఏర్పాటు చేసుకుంటున్నాడు. అయితే ఆ స్థలం అటు విద్యుత్‌శాఖ, ఇటు రెవెన్యూ శాఖల పరిధిలో ఉండడంతో ఆక్రమణదారు తన పని తాను చేసుకుని పోతున్నాడు. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు స్పందించి ఆక్రమణదారులను అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి: దుత్తలూరు మండలంలో సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 133 కేవీ లైన్ పనుల నిమిత్తం ఏరుకొల్లు, లక్ష్మీపురం 11 కేవీ ఫీడర్ల మోటార్లు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

టీడీపీ మైనార్టీలు వైఎస్సార్‌సీపీలో చేరిక

- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



పార్టీలో చేరిన ఆత్మకూరులోని 3వ వార్డు యువత



ఆత్మకూరు 17వ వార్డుకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని టీడీపీలో ఉన్న మైనార్టీ నేతలు పలువురు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం ఆత్మకూరులోని 3, 17 వార్డులకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే మేకపాటి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే మేకపాటి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్న అనంతరం మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించడం చాలా చోట్ల జరుగుతుందన్నారు. సీఏఏ వంటి వాటిని అమలు చేసిన బీజేపీతో టీడీపీ జతకట్టి ప్రజలను ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న సంక్షేమాన్ని ప్రతి కుటుంబానికి చేరవేశామని, మేనిఫెస్టోలో తెలిపిన 99 శాతం హామీలు అమలు చేసి ప్రతి ఒక్కరికీ అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరం సమష్టిగా కష్టపడి పని చేద్దామన్నారు. జగనన్న సంక్షేమం అందుకున్న ప్రతి ఒక్కరు టీడీపీకి బుద్ధి చెప్పాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా పార్టీ విజయం సాధించేలా ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, బొమ్మిరెడ్డి తారక్‌నాథ్ రెడ్డి, షేక్ రిజ్వాన్ జమీర్, కలామ్, కేతా రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో కుంభాభిషేకం

- నేటి నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు



వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేకం కోసం ధ్వజస్తంభం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి మహాసంప్రోక్షణ, కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు భారీ ఎత్తున చేసేందుకు ఆలయం వద్ద ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం నుంచి 4వ తేదీ గురువారం వరకు త్రయాహ్నిక దీక్షగా స్వామి, అమ్మవార్లకు అష్టబంధన, మహాసంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చినజీయర్‌స్వామి ఆశీస్సులతో నిర్వహించే కుంభాభిషేక వేడుకల్లో భాగంగా తొలి రోజు సోమవారం విశ్వక్సేన పూజతో వేడుకలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పుణ్యాహవచనం, అగ్నిప్రాణాయం, కుంభ ఆరాధన, చతుర్ధ కలశస్నపనం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, శాంతి అభిషేకం, శయనాధివాసం, చతుర్వేద పారాయణం, సకల దేవత ఆహ్వానం, తదితర పూజలు వరసగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం కుంభాభిషేకంలో భాగంగా వేకువజామున సుప్రభాతం, పుణ్యాహవచనం, అగ్నిహోమ పూజలు, అనంతరం పూర్ణాహుతి సమర్పణ చేసి కలిశాలలోని జలాలతో శిఖరంపైన, నూతన ధ్వజస్తంభంపైన కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. టీడీపీ ఆస్థానం నుంచి 30 మంది రుత్వికులు రానున్నట్లు తెలిపారు. ఆలయం పక్కనే హోమాలు నిర్వహించేందుకు అగ్నిగుండాలు ఏర్పాటుకు యాగశాల నిర్మించారు. చివరి రోజు శాంతి కల్యాణం అనంతరం మధ్యాహ్నాం భక్తులకు భారీస్థాయిలో అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం శేష వాహనంపై దేవదేవేరులను విశేష అలంకరణలతో కొలువు తీర్చి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు కూడళ్లలో మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి వారి తిరునామాల విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది.

వైఎస్సార్ సీపీలో చేరికలు

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని వన్నూరప్పపాలెంకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మేకపాటి వారికి పార్టీ కండవాలు కప్పి స్వాగతించారు. ఆ గ్రామంలో టీడీపీ పూర్తిగా ఖాళీ అయిందని తెలిపారు. రాజారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు, రైతులు బాగుపడాలంటే రెండో దఫా కూడా జగనన్న సీఎం కావాలన్నారు. అందరం కలిసి పార్టీ విజయం కోసం కృషి చేయలన్నారు. చంద్రబాబును నమ్మి ఓటు వేస్తే అధికారం పెత్తనందార్ల చేతులోకి వెళ్లి పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు.

నేడు మేకపాటి విజయ సంకల్ప యాత్ర

కొండాపురం: మండలంలోని ఇస్కదామెర్ల, వెలిగండ్ల గ్రామాల్లో సోమవారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

అనుమసముద్రంపేట: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సోమవారం మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండలంలోని పందిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, సాయంత్రం 6 గంటలకు ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను సందర్శిస్తారని, అనంతరం ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.